క్లుప్తంగా

ఎల్లమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు


భక్తులకు దర్శనం ఇస్తున్న అమ్మవారు

తుక్కుగూడ: మున్సిపాలిటీ పరిధిలోని రావిర్యాల సూర్యగిరి ఎల్లమ్మ తల్లి కొంగు బంగారంలా మారింది. మంగళవారం అమ్మవారికి ఇష్టమైన రోజు కావడంతో దర్శనం కోసం భక్తులు ఉదయం నుంచే క్యూలో ఉన్నారు. అమ్మవారికి ప్రత్యేక పూజలతో పాటు, బోనం సమర్పించుకున్నారు. అనంతరం ఆలయ నిర్వాహకులు భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆ ఆలయ చైర్మన్ రెడ్డిగళ్ల రత్నం, ఈఓ మోహన్‌రావు, అర్చకులు, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత తప్పనిసరి

మున్సిపల్ కమిషనర్ వాణి


హోటళ్లను పరిశీలిస్తున్న కమిషనర్ వాణి, మేనేజర్ పర్వతాలు

తుక్కుగూడ: మున్సిపాలిటీ పరిధిలోని హోటళ్ల నిర్వాహకులు తప్పనిసరిగా పరిసరాల పరిశుభ్రత పాటించాలని మున్సిపల్ కమిషనర్ ఏ.వాణి సూచించారు. మంగళవారం పుర కేంద్రంలోని శ్రీశైలం జాతీయ రహదారిపై ఉన్న హోటళ్లను ఆమె ఆకస్మింగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. పరిశుభ్రత పాటించని హోటల్‌కు రూ.5 వేల జరిమాన విధించామన్నారు. ప్రతీ హోటల్ నిర్వాహకుడు వృత్తి, వ్యాపార, లేబర్, ఫుడ్ లైసెన్స్‌లను తప్పకుండా తీసుకోవాలన్నారు. డోమస్టిక్ సిలిండర్లు వాడితే చర్యలు తీసుకుంటామన్నారు. వినియోగదారులకు నాణ్యమైన వస్తువులను విక్రయించాలని సూచించారు. కార్యక్రమంలో మేనేజర్ పర్వతాలు, సీనియర్ అసిస్టెంట్ కే.మల్లేశ్, వార్డు అధికారులు, తదితరులు ఉన్నారు.

బీజేపీ కార్యాలయంపై దాడి సరికాదు

మహేశ్వరం: నాంపల్లిలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంపై కాంగ్రెస్ నాయకులు దాడి చేయడం పిరికి పంద చర్య అని బీజేవైఎం జిల్లా కార్యదర్శి ఈరంకి విశ్వనాథ్‌గౌడ్ అన్నారు. మంగళవారం ఆయన మామిడిపల్లిలో విలేకరులతో మాట్లాడుతూ.. కాంగ్రెస్ అధికారం చేపట్టి ఏడాది అయ్యేసరికి ఒంటెత్తు పోకడలు, నియంతపాలనను అవలంబిస్తుందన్నారు. ఆరు గ్యారంటీల పేరుతో ప్రజలను నమ్మించి అధికారంలోకి వచ్చిన అనంతరం హామీలను విస్మరిస్తున్నారన్నారు.మహిళలకు రూ.2500ల ఆర్థికసాయం, రూ.15వేల రైతు భరోసా లాంటి పథకాలకు ఎగనామం పెట్టారని విమర్శించారు. ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నిస్తే దాడులకు తెగబడడం సరికాదన్నారు. పార్టీ అధిష్టానం మాటకు కట్టుబడి ఉన్నామని, బీజేపీ కార్యకర్తలు తలుచుకుంటే కాంగ్రెస్ నాయకులు రోడ్లపై తిరగరని హెచ్చరించారు.

క్షయ వ్యాధిపై అవగాహన


క్షయ వ్యాధిపై అవగాహన కల్పిస్తున్న సిబ్బంది


శంషాబాద్: క్షయ వ్యాధి నిర్మూలనకు వందరోజుల అవగాహన కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని కొత్వాల్‌గూడ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో మంగళవారం జిమ్స్ ఆస్పత్రి ఆధ్వర్యంలో శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా క్షయ వ్యాధి రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. పౌష్టికాహారం, మంచి వాతావరణంతో పాటు పరిశుభ్రత పాటించాలని సూచించారు. అనంతరం రోగులకు హోమియోపతి మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో జిమ్స్ ఆస్పత్రి వైద్యులు, విద్యార్థులు, స్థానికులు పాల్గొన్నారు.

కూరగాయల ధరలు

దిల్‌సుఖ్‌నగర్: సరూర్‌నగర్, వనస్థలిపురం రైతుబజార్‌లలో కూరగాయల ధరల వివరాలు.. టమాటా రూ.15, వంకాయ రూ.23, బెండ రూ.45, పచ్చిమిర్చి రూ.40, కాకరకాయ రూ.45, బీరకాయ రూ.45, కాలిఫ్లవర్ రూ.13, క్యాబేజీ రూ.15, క్యారెట్ రూ.35, దొండ రూ.47, ఆలుగడ్డ రూ.25, ఉల్లిగడ్డ రూ.39, గోకరకాయ రూ.28, దోసకాయ రూ.18, సొరకాయ రూ15, పొట్లకాయ రూ.23, అరటికాయ రూ.09, చిక్కుడుకాయ రూ.45, చామగడ్డ రూ.37, మునగ రూ.85, చిలుకడ దుంప రూ.60, బీట్‌రూట్ రూ.35, కీర రూ.35, బీన్స్ రూ.45, క్యాప్సికమ్ రూ.43. ఈ ధరలు బుధవారం ఉదయం 9 గంటల వరకు వర్తిస్తాయి.

అధ్వానంగా లింకు రోడ్డు

- అభివృద్ధికి నోచుకోని పులిమామిడి–కోళ్లపడకల్ రహదారి
- గుంతలతో అవస్థలు పడుతున్న వాహనదారులు
- పట్టించుకోని అధికార యంత్రాంగం


పులిమామిడి-కోళ్లపడకల్ మార్గం పక్కనే ముళ్ల చెట్లు

కందుకూరు: ఏళ్ల తరబడి రహదారిని అభివృద్ధి చేయకపోవడంతో రైతులతో పాటు చుట్టు పక్కల గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డుకు ఇరువైపులా కంప చెట్లతో పాటు కంకర తేలి గుంతలమయంగా మారిన రహదారిపై ప్రయాణించలేక అవస్థలు పడుతున్నారు. ఇదీ మండల పరిధిలోని పులిమామిడి–మహేశ్వరం మండలం కోళ్లపడకల్ గ్రామాలను కలిపే లింకు రహదారి దుస్థితి. ఆ రహదారిని అభివృద్ధి పరిస్తే షాద్‌నగర్, శంషాబాద్ హైవేకు చేరుకోవడానికి మండల వాసులకు దగ్గర దారి అవుతుంది. అయినా సంబంధిత అధికారులు మాత్రం తమకు పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారు.

నాలుగు కిలోమీటర్లే..

మండల పరిధిలోని పులిమామిడి నుంచి మహేశ్వరం మండలం కోళ్లపడకల్ మధ్య ఉన్న రహదారిని అభివృద్ధి పరిస్తే చుట్టు పక్కల గ్రామాల వారితో పాటు ఆ రహదారి వెంట ఉన్న వ్యవసాయ పొలాలకు వెళ్లే రైతులకు సౌలభ్యంగా మారుతుంది. కాగా ప్రభుత్వం మాత్రం పులిమామిడి నుంచి కేవలం కిలోమీటర్ లోపు రూ.15 లక్షలు వెచ్చించి 2015 సంవత్సరంలో బీటీ రహదారిని నిర్మించింది. అది ప్రస్తుతం గుంతలమయంగా మారింది. ఆ సమీపంలో ఉండే ఆశ్రమ నిర్వాహకులే తరచూ ఆ రహదారికి మట్టి పోసి మరమ్మతులు చేయించుకోవాల్సిన దుస్థితి నెలకొంది. మరో పక్క కోళ్లపడకల్ నుంచి పులిమామిడి వైపు దాదాపు ఒక కిలోమీటర్ వరకు రోడ్డు బాగానే ఉంది. మధ్యలో ఉన్న నాలుగు కిలోమీటర్లు పూర్తిగా పాడయింది. కంకర తేలి గుంతలమయంగా మారింది. ఆ మధ్యలో అటవీ భూములు కారణం చూపుతూ ఎవరూ పట్టించుకోవడం లేదు. అధికారులు మాత్రం పూర్తిగా రహదారి అటవీ భూముల్లోనే ఉందంటూ తరచూ కందకాలు తవ్వి రాకపోకలకు అంతరాయం కలిగిస్తుంటారు.

అన్నీ విలాస భవనాలే..

మరోపక్క ఆ రహదారి వెంబడి గత ఏడాది కాలంగా ఫాంల్యాండ్ వెంచర్లు చేస్తూ అందులో విలాస భవంతులు నిర్మిస్తూ వాటిని విక్రయించి సొమ్ము చేసుకోవడం వరకే వ్యాపారులు దృష్టి సారిస్తున్నారు. కనీసం ఆ రహదారికి మరమ్మతులు చేయించాలన్న ధ్యాసే కన్పించడం లేదు. ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు కాకపోయినా అక్కడ ఫాంల్యాండ్ వెంచర్లలో ఇళ్లు నిర్మించి సొమ్ము చేసుకుంటున్న వారిపై పంచాయతీ అధికారులు ఒత్తిడి చేసి రహదారిని నిర్మించేలా చేయవచ్చు. ఆ దిశగా మాత్రం వారు ఎలాంటి ప్రయత్నం చేయడంలేదు.

దగ్గర దారి

రహదారిని అభివృద్ధి పరిస్తే షాద్‌నగర్, శంషాబాద్ వైపుకు వెళ్లడానికి చాలా దగ్గర దారవుతుంది. లేకపోతే అటు చిప్పలపల్లి లేదా మహేశ్వరం లేదా ఇతర మార్గాల్లో వెళ్లాలంటే అదనంగా మరో 12 కిలోమీటర్ల మేర దూరం పెరుగుతుందని స్థానికులు వాపోతున్నారు. ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి రహదారి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.


మట్టి రోడ్డు

> **ప్రతిపాదనలు పంపలేదు**
>
> పులిమామిడి–కోళ్లపడగల్ మధ్య రహదారి సమస్య పరిష్కారానికి ఇప్పటివరకు ఎలాంటి ప్రతిపాదనలు పంపలేదు. త్వరలో సర్వే చేసి అవసరమైన నిధుల కోసం ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపుతాం.
>
> – సతీష్‌కుమార్, ఏఈ పీఆర్

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

తుర్కయంజాల్: సబ్‌స్టేషన్ పరిధిలోని 11కేవీ టీఎస్ఐఐసీ నాదర్‌గుల్ ఫీడర్‌లో మరమ్మతుల కారణంగా బుధవారం ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్లు ఏఈ రవీందర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. దీంతో ఫీడర్ పరిధిలోని పార్వతిపురం, గైరాన్‌కోట, ఎంఎస్ఆర్ హోమ్స్, ద్వారకాపురి, మర్రిగూడ, రంగన్నగూడ, కుర్మల్‌గూడ, ఎస్‌పీఆర్ హోమ్స్, ఇందిరానగర్, జేఎస్ఎస్‌యూఆర్ఎం, అగ్రికల్చర్, ఆదిబట్ల మెయిన్‌రోడ్, ఆయుధాల గడ్డలో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నామని, వినియోగదారులు ఈ విషయాన్ని గమనించి సహకరించాలని ఆయన కోరారు.

మరమ్మతుల కారణంగా..

హుడాకాంప్లెక్స్: విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా బుధవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని సరూర్‌నగర్ డివిజినల్ ఇంజినీర్ కే.రామకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. 11కేవీ ఆంధ్రకేసరినగర్ ఫీడర్ పరిధిలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు. 11కేవీ సామనగర్, శారదానగర్, దేశ్‌ముఖ్ ఫీడర్ల పరిధిలోని కాలనీలలో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు. 11కేవీ గౌరెల్లి ఫీడర్ పరిధిలోని ప్రాంతాల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు. 11కేవీ తారామతిపేట ఫీడర్ పరిధిలోని కాలనీలలో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని, వినియోగదారులు గమనించాలని ఆయన కోరారు.

కలెక్టర్ పర్యటన రద్దు

- ఆగ్రహం వ్యక్తం చేసిన భూ బాధితులు
- పరిహారం అందించాలని ఎల్మినేడు భూ పోరాట కమిటీ డిమాండ్

ఇబ్రహీంపట్నం రూరల్: టీజీఐఐసీ భూ సేకరణలో భాగంగా భూములు కోల్పోయిన బాధితులకు పరిహారం అందించాలని ఎల్మినేడు భూ పోరాట కమిటీ డిమాండ్ చేసింది. మంగళవారం గ్రామానికి జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి, ఇబ్రహీంపట్నం ఆర్డీఓ అనంతరెడ్డిలు వస్తున్నారని భూ బాధితులు హాజరు కావాలని ముందస్తుగా డప్పు చాటింపు వేశారు. దీంతో ఉదయం 10:30కి భూములు కోల్పోయిన బాధితులు గ్రామ పంచాయతీ కార్యాలయం వద్దకు చేరుకున్నారు. 12 గంటలు దాటినా అధికారులు రాకపోవడంతో విసిగిపోయారు. ఆకస్మికంగా పర్యటన వాయిదా వేసినట్లు సమాచారం రావడంతో రైతులు ఆగ్రహానికి గురయ్యారు. పంచాయతీ కార్యాలయం ఎదుట నిరసన చేపట్టారు. అధికారులు గ్రామానికి రావాలని నినాదాలు చేశారు. భూములు కోల్పోయిన రైతులకు పరిహారం ఇవ్వాలని కోరారు. న్యాయంగా జాబితా సిద్ధం చేసి ప్రభుత్వానికి సిఫార్సు చేయాలన్నారు. దండోరా వేయించి కార్యక్రమం రద్దు చేయడంలో అంతర్యమేమిటని ప్రశ్నించారు. త్వరలోనే అధికారులు గ్రామంలో పర్యటించి నిజమైన లబ్ధిదారులకు పరిహారం అందించేలా చూడాలని, లేకుంటే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో భూ పోరాట కమిటీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.


ఎల్మినేడులో పంచాయతీ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న రైతులు

ఉన్నత విద్యనందించేందుకు కృషి

- ప్రిన్సిపాల్ డాక్టర్ వెంకటరమణారెడ్డి

మొయినాబాద్‌రూరల్: నాణ్యమైన విద్య అందించడంలో భాగంగా చెవిటి, మూగవారి కోసం కంప్యూటర్ లాంగ్వేజ్ చేతి సైగలతో నూతన విద్యాభ్యాసాన్ని నిర్వహిస్తున్నట్లు జేబీఆర్‌ఈసీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వెంకటరమణారెడ్డి అన్నారు. మంగళవారం మండల పరిధిలోని జేబీఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో విద్యార్థుల ప్రతిభ కోసం చెవిటి, మూగ వారిని ప్రత్యేకంగా గుర్తిస్తూ వారికి అర్థమయ్యే విధంగా లాంగ్వేజ్ సైగలతో కంప్యూటర్‌లో పదాలు టైప్ కావడం ప్రాజెక్టు ఎక్స్‌పోను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ విద్యాసంస్థల్లో విద్యార్థులు వేల మంది చదువుతున్నారని, అందులో కొందరు మూగ, చెవిటి వారు ఉండడంతో పాటు వారికి ప్రత్యేకంగా ఉన్నత విద్యను అందించడానికి కళాశాల యాజమాన్యం కృషి చేస్తుందన్నారు. అలాంటి వారి కోసం ప్రత్యేకంగా కంప్యూటర్‌లో పదాలుగా మార్చి ఉంచడం, సరికొత్త ఆవిష్కరణతో ప్రాజెక్టు ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌ఓడీ ప్రభాకర్, కో–ఆర్డినేటర్ అంజలి, అబ్దుల్ రహీం, డాక్టర్ ఎల్.వీ.రెడ్డి, పి.వై.రమేశ్, కెనడి బాబు,శేషగిరి, ప్రసాద్, అరుణ్‌మూర్తి తదితరులు పాల్గొన్నారు.


కంప్యూటర్ ప్రాజెక్టును ప్రారంభిస్తున్న ప్రిన్సిపాల్ డాక్టర్ వెంకటరమణారెడ్డి, తదితరులు

వాతావరణ మార్పులపై వర్క్‌షాప్

శంకర్‌పల్లి: మండలంలోని దొంతాన్‌పల్లిలో గల ఇక్ఫాయ్ డీమ్డ్ విశ్వవిద్యాలయంలో మంగళవారం వాతావరణ మార్పులు–అవగాహన అనే అంశంపై వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఇక్ఫాయ్ టెక్, పర్యావరణ క్లబ్ పరితంత్ర ఆధ్వర్యంలో చేపట్టారు. ఈ సందర్భంగా ఇక్ఫాయ్ వైస్ ఛాన్స్‌లర్ విజయలక్ష్మి మాట్లాడుతూ.. కాలానుగుణంగా వాతావరణం వేగంగా మారుతుందని, ఇది పర్యావరణానికి పెను ముప్పుగా మారే అవకాశం ఉందన్నారు. జాతీయ స్థాయిలో వాతావరణ మార్పులతో జరిగే ప్రభావాలు, పారిస్ అగ్రిమెంట్, అంతర్జాతీయ ఒప్పందాలకు అనుగుణంగా చేపట్టే డీకార్బనైజేషన్ చర్యల అవసరాన్ని గూర్చి హ్యూమన్ క్లెమేట్ ఇంటరాక్షన్ ఇనిషియేటివ్ చైర్‌పర్సన్ డా.సౌమిత్ర, డైరెక్టర్ రితురాజ్ వివరించారు. కార్యక్రమంలో ఎస్ఎంఎఏటీ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ వ్యవస్థాపకుడు, చీఫ్ ఎడిటర్ కరుణాకర్‌రెడ్డి, ఇక్ఫాయ్ డైరెక్టర్లు, డీన్లు,పాల్గొన్నారు.

పోషకాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం

- ప్రగతి వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు డాక్టర్ అలోక్ అగర్వాల్

షాద్‌నగర్‌రూరల్: పోషక విలువలతో కూడిన ఆహారాన్ని తీసుకుంటే ప్రతీ ఒక్కరికి సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని ప్రగతి వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు డాక్టర్ అలోక్ అగర్వాల్ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని బూర్గుల గ్రామంలో ఉన్న ప్రగతి వెల్ఫేర్ సొసైటీలో పోషకాహార లోప నిర్మూలనపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సమావేశంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆశవర్కర్లు, అంగన్‌వాడీ, ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు. విద్యార్థులకు బరువు, ఎత్తు, కొలతతో ఏ విధంగా నిర్ధారణ చేయాలో తెలియజేశారు. అనంతరం డాక్టర్ అలోక్ అగర్వాల్ మాట్లాడుతూ.. అంగన్‌వాడీ కేంద్రాలకు, పాఠశాలలకు వచ్చే విద్యార్థులకు పోషకాహార లోపాన్ని గుర్తించాలని సూచించారు. పోషకాహారం లోపం ఉన్న విద్యార్థులకు పౌష్టికాహారాన్ని అందించి వారి ఎదుగుదలకు తోడ్పాటును అందించాలని సూచించారు. కార్యక్రమంలో సొసైటీ సభ్యులు శంకర్, మురళీ, కార్తీక్, శ్రీకాంత్, తులసీ, లావణ్య, జగదీశ్, శృతి, ఏఎన్ఎంలు, ఆశవర్కర్లు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న డాక్టర్ అలోక్ అగర్వాల్


మాట్లాడుతున్న ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ గట్టుమల్లు

ఆర్టీసీ డ్రైవర్లు ఆదర్శవంతులు

హయత్‌నగర్: ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ ప్రమాదాలు జరగకుండా వాహనాలులను నడపడంలో ఆర్టీసీ డ్రైవర్లు ఇతరులకు ఆదర్శంతంగా నిలుస్తున్నారని వనస్థలిపురం ట్రాఫిక్ సీఐ గట్టుమల్లు, ఆర్టీసీ హైదరాబాద్ రీజియన్ డిప్యూటీ మేనేజర్ జగన్ అన్నారు. రోడ్డు భద్రతా మాసోత్సవాలను పురస్కరించుకుని హయత్‌నగర్1, 2 డిపోలలో ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో వారు ముఖ్య అతిథులు పాల్గొని మాట్లాడారు. రోడ్డుపై నడిచే లక్షల వాహనాల నడుమ బస్సులు నడిపేందుకు ఎంతో ఏకాగ్రత అవసరమని ఆర్టీసీ డ్రైవర్లు ఎంతో ఓపికతో బస్సులను నడుపుతూ ప్రయాణికులకు మెరుగైన సేవలు అందిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో డీఎంలు విజయ్, శ్రీనివాస్, సహాయ మేనేజర్లు విజయకుమారి, రమాదేవి, సత్తయ్య పాల్గొన్నారు.

సీనియర్ సిటిజన్స్ సంక్షేమానికి కృషి

వనస్థలిపురం: సీనియర్ సిటిజన్స్ సంక్షేమానికి కృషి చేస్తానని వనస్థలిపురం డివిజన్ కార్పొరేటర్ రాగుల వెంకటేశ్వర్‌రెడ్డి అన్నారు. డివిజన్ పరిధిలోని క్రాంతి హిల్స్ కాలనీ కమ్యూనిటీహాల్లో సీనియర్ సిటిజన్స్ కోసం ఏర్పాటు చేసిన చెస్, క్యారంబోర్డు సౌకర్యాలను మంగళవారం ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో బద్దం రాంరెడ్డి, సత్తిరెడ్డి, వెంకట్‌రెడ్డి, శ్రీనివాస్, మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

విద్యార్థులకు పరీక్ష ప్యాడ్‌ల అందజేత

మలక్‌పేట: విద్యార్థులు పట్టుదలతో చదివి మంచి మార్కులు సాధించాలని ప్రధానోపాధ్యాయులు శశికళ అన్నారు. గంటా అరవింద్ పటేల్ ఆధ్వర్యంలో మూసారంబాగ్‌లోని బాగ్ మూసారిమో జీపీ స్కూల్‌కు చెందిన 165 మంది విద్యార్థులకు సోమవారం పరీక్ష ప్యాడ్‌లు పంపిణీ చేశారు. 10వ, తరగతి చదువుతున్న 45 మంది విద్యార్థులకు ఫైల్ ఫోల్డర్స్ అందజేశారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి గీత, జనమిత్ర, నాయకుడు రాకేష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

స్పా సెంటర్లలో పోలీసుల తనిఖీలు

చైతన్యపురి: చైతన్యపురి పోలీస్ స్టేషన్ పరిధిలోని పలు స్పా సెంటర్లలో మంగళవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించినట్లు ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వరరావు తెలిపారు. ఓమ్ని ఆసుపత్రి సమీపంలోని రిలాక్స్ హట్, అల్కాపరి చౌరస్తాలోని రిఫ్రెష్ హబ్, నాగోలులోని వైలెట్ బ్యూటీ స్పా సెంటర్లలో తనిఖీలు చేశామని సరైన రికార్డులు లేకపోవడంతో కేసులు నమోదు చేశామన్నారు.

నిధుల మంజూరుకు వినతి

హస్తినాపురం: డివిజన్ పరిధిలో ప్రజలకు అవసరమైన మౌలిక వసతుల కల్పనకు నిధులు మంజూరు చేయాలని హస్తినాపురం డివిజన్ కార్పొరేటర్ బానోతు సుజాతా నాయక్ మంగళవారం జెడ్సీ హేమంత్ కేశవ్ పాటిల్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ..డివిజన్ పరిధిలోని అనేక ప్రాంతాల్లో కొత్త కాలనీలు పెరుగుతున్నాయని, ప్రజలకు అసరమయ్యే కనీస వసతులు కల్పించేందుకు కృషి చేస్తానన్నారు.

శ్మశానవాటిక పనులు ప్రారంభించండి

ఇబ్రహీంపట్నం రూరల్: ఆదిబట్ల మున్సిపాలిటీలోని ఎనిమిదో వార్డులో మంజూరైన శ్మశానవాటిక పనులు త్వరగతిన ప్రారంభించాలని కౌన్సిలర్ గోపగళ్ల మహేందర్ కోరారు. ఈ మేరకు మంగళవారం మున్సిపల్ కమిషనర్ బాలకృష్ణను కలిసి వినతి పత్రం అందజేశారు. అనంతరం కౌన్సిలర్ మాట్లాడుతూ.. కొంగరకలాన్‌లో 8వ వార్డుకు శ్మశానవాటికకు నిధులు మంజూరు చేశారని, నేటికి పనులు ప్రారంభించకపోవడం దారుణమన్నారు. వెంటనే పనులు ప్రారంభించాలన్నారు. స్పందించిన కమిషనర్ పనులు చేపడుతామని తెలిపారు. కార్యక్రమంలో స్థానికులు పాల్గొన్నారు.

పాఠశాలలను బలోపేతం చేయాలి

- ఎమ్మెల్యే కాలె యాదయ్య


ఉపాధ్యాయ సంఘం కేలండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే, సంఘం నాయకులు

చేవెళ్ల: ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసేందుకు ఉపాధ్యాయులు విద్యార్థులకు నాణ్యమైన విద్యాబోధన చేయాలని ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. మంగళవారం ఎమ్మెల్యే కాలె యాదయ్య నివాసంలో ఆయన చేతుల మీదుగా ప్రభుత్వ ఉపాధ్యాయ సంఘం(జీటీఏ) జిల్లా కేలండర్‌ను ఆ సంఘం సభ్యుల ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు నాణ్యమైన విద్యాబోధన చేయాలన్నారు. నాణ్యమైన బోధనతో ఉత్తమ ఫలితాలు రాబడితే ప్రభుత్వ పాఠశాలలు అభివృద్ధి చెందుతారన్నారు. ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి, మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తుందన్నారు. నియోజకవర్గంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి పూర్తి సహకారం అందిస్తానని పేర్కొన్నారు. కార్యక్రమంలో జీటీఏ సంఘం జిల్లా అధ్యక్షుడు నర్సింహ, ప్రధాన కార్యదర్శి టి.సుధాకర్, జిల్లా మహిళా కార్యదర్శి టి.సునీత, ఆర్గనైజింగ్ కార్యదర్శి బి.వీరన్న, జిల్లా బాధ్యులు జి.వెంకటరమణ, కుమార్ పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి



ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పిస్తున్న సీఐ వెంకటేశం

- జాతీయ రోడ్డు భద్రతా వారోత్సవాల్లో భాగంగా విద్యార్థులకు అవగాహన

చేవెళ్ల: మైనర్లు వాహనాలు నడపకూడదని, రోడ్డు దాటే సమయంలో పాదాచారులు ట్రాఫిక్ రూల్స్‌ను పాటించాలని ట్రాఫిక్ సీఐ ఎస్.వెంకటేశం, చేవెళ్ల సీఐ భూపాల్ శ్రీధర్ అన్నారు. మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాల, కళాశాలలో మంగళవారం జాతీయ రోడ్డు భద్రతా వారోత్సవాల్లో భాగంగా ట్రాఫిక్ రూల్స్‌పై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వారు మాట్లాడుతూ.. పాదాచారులు జీబ్రా క్రాసింగ్ లైన్ వద్దనే రోడ్డు దాటాలని, సెల్‌ఫోన్ మాట్లాడుకుంటూ రోడ్డు దాటొద్దని సూచించారు. మైనర్లు వాహనాలు ఎట్టి పరిస్థితుల్లో నడపకూడదని, అలా నడిపితే వాహన యజ మానిపై, తల్లిదండ్రులపై కూడా కేసు నమోదు అవుతుందని చెప్పారు. ద్విచక్ర వాహనాలు నడిపించే వారు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, కారు నడిపించే వారు సీటు బెల్టులు వేసుకోవాలన్నారు. ట్రిపుల్ రైడింగ్, లైసెన్స్ లేకుండా వాహనాలు నడపటం, ట్రాఫిక్ సిగ్నల్స్‌పై అవగాహన కల్పించారు. విద్యార్థులు ట్రాఫిక్ రూల్స్‌పై అవగాహన పెంచుకొని తల్లిదండ్రులు, ఇతరులకు తెలియజేయాలన్నారు. ప్రతి ఒక్కరికి ట్రాఫిక్ రూల్స్‌పై అవగాహన ఎంతో అవసరమన్నారు. వీటితో కలిగే అనర్థాలను వివరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ చిన్నపురెడ్డి, ట్రాఫిక్ ఏఎస్ఐ అశోక్, పోలీస్ అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

క్యాలెండర్ల ఆవిష్కరణ

ఇబ్రహీంపట్నం/యాచారం: మండల కేంద్రంలోని విద్యా వనరుల కేంద్రంలో మంగళవారం ఎస్టీయూటీఎస్ ఆధ్వర్యంలో నూతన క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. విద్యార్థులకు మెరుగైన విద్యాబోధన, ఉపాధ్యాయుల సమస్యలపై ఎస్టీయూటీఎస్ కృషి చేస్తుందని ఆ శాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి పాండురంగారెడ్డి తెలిపారు. కార్యక్రమంలో ఎంఈఓ పాండురంగారెడ్డి, హెచ్ఎం నర్సింహ, సంఘ సభ్యులు బాలకృష్ణ, జగన్మోహన్‌రెడ్డి, రాందేవ్‌రాజు, సల్మాన్ రాజ్ తదితరులు పాల్గొన్నారు. ఇబ్రహీంపట్నంలో ఎస్టీయూటీఎస్ నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఎంఈఓ హీర్యానాయక్ ఆవిష్కరించారు. సంఘం మండల అధ్యక్షుడు తిరుమలేశ్ పాల్గొన్నారు.

సహకార సంఘం ఆధ్వర్యంలో...

అబ్దుల్లాపూర్‌మెట్: బాటసింగారం రైతు సేవా సహకార సంఘం ఆధ్వర్యంలో నూతన సంవత్సరం క్యాలెండర్‌ను సంఘ చైర్మన్ చేగూరి భరత్ కుమార్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ నార్లకొండ మల్లమ్మ, డైరెక్టర్లు జైపాల్‌రెడ్డి, బాలనర్సమ్మ, యాదిరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, రాములు, మేనేజర్ ఐలేష్‌యాదవ్ నాయకులు జంగమయ్య, భూపాల్‌రెడ్డి సిబ్బంది పాల్గొన్నారు.



యాచారం: క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న ఎస్టీయూటీఎస్ సభ్యులు